'కడుపుమంట'

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

'మాదాకవళం అమ్మా'

శ్రావణభాద్రపదాలు— ఘోరుమని వాన— హోరుమని గాలి. అది పట్టణమే— ఆవీథిభాగ్యవంతులమేడ లున్నదే— ఏతలుపూ తీసిలేదు— ఏ సంచలనమూ వినిపించదు. పొరపాటున తీసిఉంచిన కిటికీలోనుంచి రేకరేకగా దీపపుకాంతి బాగా తడిసి మెత్తబడినరోడ్డుమీదా— గలగలమని కొత్తనీటితో పొర్లే మురుగుకాలవమీదా పడుతున్నది. రాత్రి తొమ్మిదిగంట లయింది. వర్షోద్రేకం తగ్గింది కాని గాలిహోరు వింటే గుండెలు ఆగిపోతాయి. చెట్లసంక్షోభ చూస్తే చాలా జాలీ—భయం పుడుతుంది. ఆవర్షానికి ఆమెగుడ్డపేలికలు తడిసి ఎక్కడివక్కడ అంటుకుపోయినవి. జుట్టు కొనలనుంచి నీరు కారుతున్నది. ఎడనెడ చరాలున మెరసే మెరుపుకాంతిలో ఆకలితో మండుకొనిపోయే ఆమెకళ్లూ—చేతులోని 'అల్యూమినియం' చిప్పా కనబడుతున్నవి. రోడ్డుమీద పెద్దజువ్విచెట్టు ఆగాలికి ఊగిఊగి ఎక్కడ విరిగి తనమీదపడుతుందో అని పరుగెత్తుకునివస్తూంటే పాపం కాలుజారి పడిపోయింది. ఒళ్లంతా బాడి—

ఆవీథిలో మొదటిమేడదగ్గర ఆగింది. గొంతు సర్దుకొని "మాదాకవళం అమ్మా?" "దిక్కుమాలినదాన్ని బాబయ్యా" అంటూ సమీపించింది.

* * * * *

ప్రదసోశేతముగ భోంచేసి ఆయింటిదంపతులు మేడయెక్కి గంట అయింది. అడుగున భూలోకం ఉన్నదనీ, దానిమీద కొన్నిప్రాణులు తిరుగుతాయనీ వారికి తెల్లవారితేగాని తెలియదు. పరిమళద్రవ్యములతో తాంబూలం, పన్నీరు సెంట్లు, పందిరిమంచం— ఆనిర్భాగ్యస్వరాలిమాటలు వినిపించే సమయమేనా అది? తమతో బుట్టువులయిన దురదృష్టజీవుల వేదన అర్థమయ్యే వేళేనా అది? లేదు—జవాబులేదు - చలి - ఒణుకు.

కడుపులో మహాబడబమంట. ఆగలేక తలుపుతట్టింది— చర్రునవిడింది. ఏమిటి? వీథితలుపుకాదు, పక్కకిటికీ. "నీకేం బుద్ధిలేమా? అర్ధరాత్రివేళ అన్నం అమర్చుకుని ఎవరు నీకోసం సిద్ధంగా కూచున్నారు? ఛో! అవతలికి, అరుగులు తడిపెయ్యకు." అన్నాడు వారి నౌఖరు. మళ్లీ బాటపట్టింది. ఎటుచూసినా కారుచీకటి.— కొంచెందూరంలో చిన్నవెలుగు రోడ్డుమీద— ఆమహాప్రళయంలో అంత వెలుగే కొంత అన్నం ఆమెకు. లేనిసత్తువ, రాని ఉత్సాహమూ కూడగూర్చుకొని అక్కడకు ఎలాగోవెళ్లి వాలింది.

చక్కనిపెంకుటిల్లు, గృహయజమాని ఉద్యోగి, డ్రాయరుముందు కూచుని మధ్యాహ్నం చూసిన 'న్యూస్‌పేపరే' మళ్లా చూస్తున్నాడు. ఇంకా లోపల ఎవరూ నిద్రపోలేదని తెలుస్తున్నది. వీథితలుపు చేరవేసి ఉంది. సందులోనుంచి దీపపుకాంతి రావచ్చు. అస్పష్టంగా పక్కను మాటలువినిపిస్తున్నవి. బహుశః ఆయన స్నేహితుడు కావచ్చు. ఉండి ఉండి ఉద్యోగి—"ఆహా బీహారుప్రజలకు ఎంతకష్టదశ ప్రాప్తించిందోయి, కొన్నివేల కుటుంబాలు కుంకటివేళ్లతో ఊడ్చుపెట్టుకుపోయినవట. ఎంతమంది పాపం కడుపులు చేతబట్టుకుని పక్షుల్లా మలమలమాడుతూ అల్లాడుతున్నారో—ఏం భూకంపమోయి కొంపతీసిందిగాని—మిత్రుడు—మన సోదరులకు మనంకాకపోతే ఎవరు సహాయపడతారు. తప్పక మనం కూడ కష్టపడి బీహారునిధి వసూలుచేసి పంపుదాం" అన్నాడు. వెంటనే వీథిలో—

"బాబయ్యా!"

ఉద్యోగి—"ఏం?"

"కడుపుమంటకు. పట్టెడు కబళం బాబయ్యా."

"ఛో—రేపొద్దున్న రా!"

"కాళ్లు తేలిపోతున్నయి—రెండురోజులనుంచి అన్నం ఎరగను నాయనా!"

"చెప్పింది వినిపిస్తోందా, లేదా?"

"అంతవరకూ ప్రాణం నిలిచేదెట్లా తండ్రీ?"

"నిలవకపోతే నీఖర్మం చావు! ఏం చెయ్య మంటావు ?"

దడాలున తలుపుమూసినాడు గృహాధిపతి. ఒక్కనిరుపేదరాలికి పట్టెడుఅన్నమే కరువైపోయిందిఆమహా పట్టణంలో.

రెండవవీథికి వెళ్లింది. మూడవవీథికి వెళ్లింది. ఎవ్వరూ తలుపయినా తీయలేదు. ఎవ్వరూ కరుణించ లేదు. ఆమెహృదయమూ, గర్భకోశమూ ఒక్కసారి భగ్గున మండుకొనిపోయినవి. ఆవేదనతో అరచి అరచి ఈప్రపంచాన్నీ, ఈ దయా సానుభూతీ లేని పాషాణ భాగ్యవంతులనూ శపించి పతాలున పగిలిపోదా మను కున్నది. ఆభీకరదృశ్యం చూడలేక కారుమేఘాలు కళ్ళ వళపడి అరుస్తూ పరుగెత్తుతున్నవి. ఒకటి రెండు మూడు గా చెరవిడి నక్షత్రములు తళతళ మెరుస్తున్నవి. పాపం ఆమెచేతిలోని 'అల్యూమినియం'చిప్పవేపు చూసింది. ఏమ్పుటకు నీరైనాలేని ఆపుష్కనేత్రములనుండి ఒక నీటిబొట్టూ, ఒకరక్తబిందువూ ఆ చిప్పలో ఉట్టిపడినవి. అన్నంతో నిండుతుం దనుకున్న చిప్ప అశ్రువులతో నిండింది. నిరాశగా చిప్ప తలపై బోర్లించుకొని ఆరోడ్డు వెంటే నక్షత్రకాంతికి తోవ చూచుకుంటూ పోతు న్నది. ఎక్కడికిపోతుందో తెలియదు. చలితో వజవజ వణుకుతూ ఉండిఉండి ఆకాశంవేపూ, చుక్కలవేపూ చూస్తుంది.

అయ్యో! ఈ భాగ్యవంతుల మేడనీడల్లో, ఈ ఉద్యోగస్థుల తిట్లల్లో- జువ్విచెట్ల వేళ్లల్లో — రోడ్డు పక్కల కుక్కల్లో— బతకమనా జగత్పిత అయిన భగవంతుడు ఇట్లాంటిప్రాణులను సృష్టించాడు. వీళ్లకీ అన్యాయం ఎవరు చేశారు??? కడుపునిండా భోంచేసి కాఫీతాగి-ఇంకా తాగి- కాలుకదపలేక కార్లల్లో పడి పోయే గొప్పవారికి ఆగొప్పతనం, ఆమేడలూ ఆబట్టలు ఆబంగారం - ఆతళుకూ - ఆ గౌరవం-ఎలావచ్చాయి? వీ రిలాగే పుట్టారా? వా రలాగే పుట్టారా? ఏమి టీ అన్యాయం-ఏమి టీసృష్టి తెలివితక్కువ-ఏమి టీఎగుడు దిగుడు కలతగొట్టు లోకం.

'ఉండడే ఒక దేవు డంటూ
ఉన్న ఊర్లోకనునే? '

" గెందబనీజావుంగేసయ్యా ' తేరీగోదుమే — సయ్యా తెరీ—గో—దూ—మే=గెందబనీ "

ఆరోడ్డుమలుపులో జట్కాబండ్లు నిలిచే తావు పక్కను షేక్ ఇషేకు రొట్టెలకొట్టు.

శిథిలమయిన పెంకుటిల్లు — ఒకచెంపను కూలుతున్నది. చవుడుడేరిపోయిన పెద పెద్ద అరుగులు. ఖాళీగా ఉన్న జట్కావాలా లందరు ఆ అరుగుమీద చేరి కొరడాలు తిప్పకుంటూ ఏదో బాతాఖానీ కొడుతూ ఇషేకుచేసిన తాజారొట్టీ, గరమ్ చా ఖర్చుచేస్తూ ఉంటారు. ఈవేళ బ్రహ్మాం డంగా–గాలీ–వాన రేగినందువల్ల ఒంటెద్దుబండినాయ ళ్లూ– జట్కాసాహేబులూ ఖాళీగాఉండడంచేత ఇషేకుకొట్టుఅరుగులికి మహావైభవంపట్టింది. చుట్టలు– బీడీలు–M. S. M. B. N. R. ఇంజన్లలాగ గుప్పు గుప్పున పరుగెత్తుతున్నవి. అందుచేత ఇషేకుకొట్టు ఇంకా మూయడానికి వీలయిందికాదు. మామూలుగా అయితే ఇంతకి గంటక్రితమే అతడు కొట్టు మూసి ఉండును. ఇప్పుడు కొంచెం తెరిపిఇవ్వడంచేత పఖి కులు ఒకొక్కరే దారిపట్టారు. కనక ఇషేకు పాడు కుంటూ కొట్టుసర్దుకుంటున్నాడు. చల్లగా ఈపాట భిక్షుకిచెవికి సోకింది. ఆరిపోతున్న ఆకలిమంట గుప్పునరేగి మండజొచ్చింది. ఘాటైనతురకపాట క్రొత్త సారాఅంతవికారం, ఉద్రేకం, తామసమూ కలుగ జేస్తుంది. ఆపాటవినగానే ఆమెకు భయంవేసి ఒళ్లు గజగజవణికింది. వాంతివచ్చేటంతబాధ కలిగింది. కాని కాళ్లు కదులుతూనే ఉన్నవి.

మనిషివాసన తగిలితే చాలు. ఏహృదయాని కేనా దయఉండదా— ఏమనస్సుకేనా ఆకలిబాధ అర్థంకాదా అనీ ఆమెఆశ. మెల్లగా ఎలాగో రొట్టెల కొట్టుగుమ్మందగ్గర నిలిచింది. ఏమైనా అడుగుదా

మని గొంతుఎత్తింది. కాని బిగుసుకుపోయింది. ఏదో అడ్డుపడినట్లయింది. ఎంతచించుకున్నా మాట రాలేదు. అర్ధరాత్రి — పట్టణమంతా నిశ్శబ్దం — నిర్మానుష్యం. విన్నది తురకపాట. అయినప్పుడు దిరిశెనపువ్వువంటి భారతస్త్రీహృదయం - ఎంత తల్లడ పడిపోతుంది. ఎంత సంక్షుభితమవుతుంది. ఎట్టకేలకు "బాబయ్యా" అని గొంతుపెకలించుకుని ఉట్టిపడింది.

"కౌన్ రే? బైఠో! ఆతాహూ—" ఆమె తలపై పిడుగుపడింది.

చరచర వచ్చినతోవనే పోదామనుకున్నది. కాళ్లు తిరిగిపోయినవి. అరుగుమీద చదికిలబడ్డది. ఏదైనాగానీ— ఇతన్ని —ఏమైనా అడుగుదాం—ఏజాతి అయితేనేం? మంచివారు ఎందులోమట్టుకు ఉండరు? జాతీ నీతీ ధారాళంగా వెలిగిస్తున్న హిందువులఇళ్లంట తిరిగితిరిగి తిన్నదేమిటి అనుకున్నది. ఇషేకు ఇవతలకువచ్చాడు. మిలమిల మెరిసే చుక్కలవెలుగులో అస్పష్టంగా ఆమె ముఖమును చూశాడు. ఆవెలుగు-చీకట్లమధ్యలో మల్లెపూవుల్లా పరిమళిస్తున్నాయి ఆమెకళ్లు. నాచుకప్పిన కలవపువ్వువలె ఆమెముఖం వివృతముకాలేదు. ఇషేకు లోపలికివెళ్లి లాంతరు తెచ్చాడు. భిక్షుకి గుడ్డపేలికలను సరీగా సర్దుకునికూర్చున్నది. "ఎవరమ్మా నీవు— ఏమి కావాలి నీకు" అన్నాడు ఇషేకు. తలఎత్తకతీరదు. తలఎత్తక జవాబుచెబితే అవినయం స్ఫురిస్తుంది. "బాబూ పట్టెడుకవళంకోసం ఊరంతా తిరిగాను. ఎవ్వరూ కనికరించలేదు. రెణ్ణాళ్లనించి తిండిలేదు" అన్నది. ఇషేకు నిదానించి ఆమెనుచూశాడు. ఎన్నడో తాను ఈమెను ఎరుగును. ఇంతవరకూ బాహ్యప్రపంచంలో పట్టిన గాలివాన ఇప్పుడు ఇషేకుతలలో పట్టింది.

"తచ్చేతసా స్మరతి నూన మబోధపూర్వం
భావస్థిరాణి జననాంతరసౌహృదాని"

* * * * *

సుమారు పదేళ్లవుతుంది.

విజయనగరంకొత్తపేటలో 'రిజర్వాయరు'కు సమీపంలో ఒకపెద్దరావిచెట్టుంది. ఆచెట్టుకి ఉత్తరంగా తెలగా అప్పలస్వామిఇల్లు. 'వాటరువర్క్సు'లో అతనికి చిన్ననౌఖరీ. ఎనిమిదిరూపాయలుజీతం— ఎందుకూ చాలదు పాపం. ఒకప్పుడు అతనిస్వగ్రామం అయిన అలమండలో ఇరవైగాళ్ల ఎడ్లతో వ్యవసాయం— పెద్దవి—రెండు అంటుమామిడితోటలు— నలుగురు తమ్ములూ, నిత్యకల్యాణం పచ్చతోరణంగాను ఉండి అప్పలనాయుడుగా రనిపించుకున్నవాడే. తమ్ముల అప్రయోజకత్వంవల్లా, ఋణాలవల్లా, యావదాస్తీ శ్రీరామరక్ష అయిపోయి దిక్కులేక రెండవభార్య సూరమ్మతో విజయనగరంచేరి ఆతక్కువజీతంతోటే కాలంగడిపేవాడు. సూరమ్మ తెలివయినపిల్లకావడంచేత ఎక్కడికి అక్కడే సర్దుకొని లేమి లేకుండా ఆదంపతులు హాయిగా బతికేవారు.

రావిచెట్టుకింద జట్కాబళ్లు ఆగుతాయి. షేక్ హజరతుకి ఒకజట్కా ఉంది. అతడు పెద్దమనిషి. అతనికి ఒక్కతమ్ముడు. పైలాపచీస్. పక్కమెడబొత్తాల చొక్కా, ఒదులు ఇజారు, రాడీక్రాపు. రావిచెట్టువేళ్లమీదకూచుని ఏవేవో తురకపాటలు పాడి మత్తెక్కించేవాడు. సూరమ్మను చూసినప్పుడల్లా అతని పాటలో కొత్తసంగతులూ, గొంతులో మంచిబిదుగూ, మనస్సులో మంచి ఉత్సాహమూ కలిగేవి. ఏమీ తోచకపోతే రావిచెట్టువేళ్లమీదకు చేరేవాడు. సూరమ్మకోసం గంటలకొలది ప్రతీక్షించేవాడు. ఆమె ఇతని నెప్పుడూ చూసిఉండదు. హిందూస్తానీపాటలంటే ఆమె కిష్టంలేదు.

హజరతులేనప్పుడు ఒకసారి ఇతడు తప్పతాగి జట్కాతోలుతూ ఒకపెద్ద ఉద్యోగిబండితో ఢీకొల్పి బండీ, గుర్రం అమ్మితేగాని తీరనంత జరిమానాతిని చెప్పకుండా ఎక్కడికో పారిపోయాడు.

అప్పలస్వామికి ఏదో అవసరంకలిగి ఒక మారు వాడీదగ్గర ఇరవైరూపాయలు ఇంటిమీద అప్పు తెచ్చాడు. తనజీతంమీద తీర్చుదా మనుకున్నాడు.

మారువాడీ అప్పూ, న్యూమోనియాజ్వరం మనిషిని ఇక తేల్చడం సున్న. వడ్డీకివడ్డీ మారువాడీచిఠాలో

పెరుగుతూనే ఉన్నది. అప్పలస్వామి చేయి సర్దుకోలేక పోయాడు. అకస్మాత్తుగా ఒకనాడు కలరావల్ల చచ్చి పోయాడు. సూరమ్మ దిక్కులేని నిర్భాగ్యురాలై పోయింది. తినతిండిలేదు. కట్ట గుడ్డలేదు. ఏకాకి – ఆడది. సందెకవళమే జీవనోపాధి. విజయనగరం విడిచి వెళ్లి పోయింది.

* * * * *

తలవనితలంపుగా జరిగిన ఈఅద్భుత సన్నివేశానికి నివ్వెరపడిపోయాడు ఇషేకు. తాను పూర్వం విజయనగరంలో రావిచెట్టుకింద పాడుతూ చూసిన గులాబిపువ్వు లాంటి సూరమ్మేనా తనఎదుట దిక్కుమాలి, చింపిగుడ్డలతో కనిపిస్తున్నది– నమ్మలేకపోయాడు. అతని నరాలు తంబురాతీగెల్లా బిగుసుకుపోయినవి. "ఏఅమ్మో నీకేం ఫర్వాలేదు. నాలుగు తాజారోటీ ఇస్తాను తిను. ఒక ఖండ్వాఇస్తాను. కట్టుకో— ఈరాత్రికి ఇక్కడే పడుకో" అన్నాడు. సూరమ్మకి అయిదుప్రాణాలు లేచి వచ్చాయి. ఆహా నాలుగురొట్టెలు–కడుపునిండుతుంది. ఆబట్టకట్టుకుంటే ఈచలిఅంతా పోతుంది– కాని– –ఈరాత్రి ఇక్కడ పడుకోడం ఎందుకూ??? ఛీ–ఛీ – ఆమెకేదో తోచింది, కళ్లు భగ్గున మండినవి. ఇన్నాళ్లూ, గుడ్డలేకపోయినా, కూడు లేకపోయినా, ఎన్నికష్టాలువచ్చినా కాపాడిన మానధనం నేడీకరకు తురకకు కొల్ల పెట్టవలసిందేనా? అప్పలస్వామి ఏడుస్తూ కనిపించినట్టయింది. భోర్లుమని అతనిని కౌగలించుకుని ఏడవబోయింది. ఏడవడానికి తగిన సత్తువ ఏదీ– కొయ్యబారిపోయినది. ఇషేకువచ్చి ఆమె చేయిపట్టుకొన్నాడు. ఆమె ప్రతినరములోను తాచుపాములు బుసకొట్టి హృదయంలోకి పరుగెత్తినవి. కాని ఆకలి మంట అన్నిటిని ఆహుతి చేసుకున్నది.

"అమ్మో, లే, ఏంభయం లేదు. తాజారోటీ లోపలఉంది, రా. ఈఖండ్వా పుచ్చుకో" అని ఆమెను లేవదీసి లోపలికి తీసుకొని వెళ్లి తలుపువేశాడు.

చెల్లాయి పెళ్లికట్నం

చావలి బంగారమ్మ

సిరియనందగు చెల్లి
సరసంపుసభలోను
పరువైన లేనవ్వు
పెదవులందోగాడ—

భావాలె పూవులై
పరిమళించెడు దండ
పతికంఠసీమ నిడు
తరి నట్టెచూడగా—

ఒకరిబొమ్మొకరిదై
కనులలో కరగిపో
మరలి రాలేనిదై
... ...

తెలియజెప్పగలేని
తేజస్సు లల్లేను
పాల్తాగుబిడ్డ లే
పలుకులో తీపల్లె—

వర్ధిల్లు డో తల్లి
వర్ధిల్లు కల్యాణి
వర్ధిల్లు జయలక్ష్మి
వర్ధిల్లు డమ్మా!